

బృందానికి అభినందన నిర్వహించిన అతిథులు

'వందేభారత్' బృందానికి అభినందన

చిక్కడపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): యువతకు మంచి సందేశం అందించే సంకల్పంతో తీసిన వందేభారత్ సినిమా బృందానికి అభినందన సత్కారం జరిగింది. కళారత్న మూవీస్ నిర్మాణంలో ప్రముఖ మెజీషియన్ మల్లం రమేష్ నిర్మించి దర్శకత్వం వహించిన ఈ సినిమా యూనిట్‌కు త్యాగరాయగానసభలో కళానిలయం ఆధ్వర్యంలో సురేందర్, పుష్పలత పర్యవేక్షణలో ఈ సత్కారం చేశారు. పోలీస్ ఉన్నతాధికారి దార్ల కాళీదాస్, దర్శకుడు రమేష్ మాట్లాడారు. సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తి పురస్కారాలను వివిధరంగాల ప్రముఖులకు బహూకరించారు.

పార్సీగుట్ట రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి



ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు వినతిపత్రం అందజేసిన నర్సింగ్ ప్రసాద్ తదితరులు

ముషీరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ నుంచి పార్సీగుట్టకు వెళ్లే మార్గంలో రోడ్డును తవ్వి అలాగే వదిలేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు నర్సింగ్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానికులు ఎమ్మెల్యేను కలిసి రోడ్డునిర్మాణ పనులు పూర్తి చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో స్థానిక నాయకులు రవీందర్, చంద్రశేఖర్, మోహన్‌రావు, నర్సింహ, డేవిడ్, రంగప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ముదిరాజ్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్

నల్లకుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు దశాబ్దాల తర్వాత ముగ్గురు ముదిరాజ్ అభ్యర్థులు పార్లమెంటు ఎన్నికల బరిలో నిలిచారని, పార్టీలు, సంఘాలకు అతీతంగా వారి విజయానికి ముదిరాజ్ కులస్తుందరూ కృషి చేయాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బీజేపీ నుంచి మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్, మెదక్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా నీలం మధులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సలేంద్ర శివయ్య, మద్దెల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణోత్సవంలో పాల్గొన్న చింతాగణేష్, ప్రొ.ప్రదీప్‌కుమార్ తదితరులు

ఘనంగా తులసీభవన్ స్వర్ణోత్సవం

చిక్కడపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భక్తి, సాహిత్య, సాంస్కృతిక పరిశోధనా కేంద్రం తులసీభవన్ స్వర్ణోత్సవాన్ని, రంగస్థల దినోత్సవాన్ని శనివారంచిక్కడపల్లిలోని తులసీభవనంలో నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ ప్రొ. ప్రదీప్ కుమార్ అధ్యక్షత వహించగా విద్యావేత్త ప్రొ. చింతాగణేష్, ఉస్మానియాయూనివర్సిటీ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శివాంగి కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జంటనగరాలల్లోని కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన నాటిక పోటీల విజేతలు 60 మందికి ఈ సందర్భంగా పురస్కారాలు, అవార్డులు బహూకరించారు.

'పట్టణ శ్రామికుల నివాస, ఉపాధి హక్కులకు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలి'

రాంనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ శ్రామిక ప్రజలకు నివాస, ఉపాధి హక్కులకు సంబంధించి ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలని తెలంగాణ పట్టణ పోరాటాల వేదిక డిమాండ్ చేసింది. బస్తీ ప్రజల నివాసాలకు పట్టణ భూమి, నివాస హక్కులకు పట్టణ శ్రామిక ప్రజలందరి పౌర హక్కులను కల్పించేందుకు తమ వేదిక పోరాటం చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో నగర శ్రామిక ప్రజల మేనిఫెస్టోను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా జాతీయ ప్రజా ఉద్యమాల వేదిక జాతీయ నాయకురాలు మీరా సంఘ మిత్ర, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, నిరాశ్రయుల శ్రామిక సంఘటన ప్రతినిధి సయ్యద్ ఫిరోజ్ మాట్లాడారు.

అధిక ధరలకు మద్యం విక్రయాలు .. వ్యక్తి అరెస్ట్

కవాడిగూడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా అధిక ధరలకు మద్యం విక్రయాలు చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు దోమలగూడ పోలీసులు శనివారం తెలిపారు. సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలోని గిల్మా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గాంధీనగర్‌కు చెందిన బెగ్గరి దివాకర్ (33) వద్ద ఆఫీసర్స్ చాయ్స్ 90ఎంఎల్ 30 బాటిల్స్, గుడ్ డే విస్కీ క్వార్టర్లు 5 సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చోరీ, బెదిరింపులకు పాల్పడ్డ యువకుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చోరీ, బెదిరింపులకు పాల్పడుతున్న యువకుడిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. చిక్కడపల్లి జవహర్‌నగర్ ప్రాంతానికి చెందిన కోట సాయితేజ (26) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు మందలించడంతో మార్చి 6 నుంచి అమీర్‌పేట శ్రీ సాయి తేజ హాస్టల్‌లో ఉంటూ స్నేహితుల బైక్‌లు తీసుకొని ర్యాపిడో డ్రైవింగ్ చేసుకుంటున్నాడు. ఇతడు మార్చి 13న తెల్లవారు జామున సత్యం థియేటర్ సమీపంలోని ఏబీసీ డీలక్స్ హాస్టల్ సెల్లార్‌లో ఉన్న యాక్టివా వాహనం చోరీ చేశారు. దానిపై తిరుగుతూ ఈ నెల 28న సోమాజిగూడ నీరూస్ షాపింగ్ మాల్ వద్ద ఆటో డ్రైవర్‌ను బెదిరించి అతడి ఫోన్, డబ్బులు లాక్కున్నాడు. అంతేకాకుండా ఫోన్‌లో ఉన్న డబ్బును సమీపంలో ఏటీఎం సెక్యూరిటీకి పంపి తీసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్‌ల ద్వారా సాయితేజ చోరీ, బెదిరింపులకు పాల్పడ్డట్టు గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతపికప అదుపులోకి తీసుకుని యాక్టివా, సెల్‌ఫోన్, డబ్బులు స్వాధీనం చేసుకున్నారు.

పాత కక్షలతో మద్యం బాటిల్, కత్తితో దాడి

బర్కత్‌పుర మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో నేపథ్యంలో ఇరువురు వ్యక్తులు శనివారం రాత్రి మద్యం బాటిల్, కత్తితో దాడి చేసుకుని గాయాలపాలయ్యారు. ఈ సంఘటనపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలానా ఆజాద్ నగర్‌లో నివాసముంటున్న రాహుల్(27) శనివారం రాత్రి గోల్నాకలో ఉంటున్న భరత్‌కుమార్ ఇంటికి వెళ్తుండగా.. పాత స్నేహితుడు సందీప్(25) కనిపించాడు. అప్పటికే వీరి మధ్య పాత కక్షలున్నాయి. అయినా రాహుల్.. సందీప్‌ను పిలిచి భరత్ కుమార్ ఇల్లు ఎక్కడ అని అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవ జరిగింది. అదే సమయంలో సందీప్ సోదరులు సాయి(29) దుర్గ ప్రసాద్ (27) అక్కడికి వచ్చారు. ముగ్గురు కలిసి మద్యం బాటిల్‌తో రాహుల్‌పై దాడి చేశారు. ఈ దాడిలో రాహుల్ తలకు గాయాలయ్యాయి. అదే సమయంలో రాహుల్ కూడా సందీప్‌పై కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సందీప్‌కు ప్రాథమిక చికిత్స అందించి అతనితో పాటు ఇద్దరు సోదరులను అదుపులోకి తీసుకున్నారు. రాహుల్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు ప్రస్తుతం రాహుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి కాలేరు?

- సోషల్ మీడియాలో వైరల్
- ఇందుకోసమే కేటీఆర్ పర్యటన రద్దయినట్లు ప్రచారం
- బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నా : ఎమ్మెల్యే



బర్కత్‌పుర మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు శనివారం జోరుగా ప్రచారం జరిగింది. రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావుతో అత్యంత సన్నిహితంగా ఉండటం వల్ల కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాలేరుతో పాటు మరికొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం జరిగింది. శనివారం సాయంత్రం మాజీ మంత్రి కేటీఆర్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌తో అంబర్‌పేట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సి ఉంది. అయితే, కేటీఆర్ పర్యటన ఆదివారానికి వాయిదా పడింది. కాలేరు వెంకటేష్ కాంగ్రెస్‌లోకి వెళుతుండటం వల్లనే కేటీఆర్ పర్యటన రద్దయినట్లు నియోజకవర్గం అంతా ప్రచారం జరిగింది. అయితే, కేటీఆర్ పర్యటన ఆదివారం సాయంత్రానికి వాయిదా పడటంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఊపిరిపీల్చుకున్నారు. గతంలో కేటీఆర్ ఈ నియోజకవర్గ పర్యటనకు వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు, నాయకులు హల్‌చల్ చేసేవారు. రెండు రోజుల ముందే ఫ్లెక్సీలు, బ్యానర్లతో బస్తీలు, చౌరస్తాలు నిండిపోయేవి. అయితే కేటీఆర్ అంబర్‌పేటలో పర్యటిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి హంగామా లేదు. పటేల్‌నగర్ చౌరస్తా వద్ద స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ ఒక్క ఫ్లెక్సీ మాత్రమే ఏర్పాటు చేశారు. ఇది నియోజకవర్గం అంతా ప్రధాన చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ పార్టీ గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌కు కేటీఆర్ పర్యటనకు సంబంధించి సమాచారం తెలియకపోవడం కొసమెరుపు.

అవాస్తవం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను ఎమ్మెల్యేకు అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి తాను అసెంబ్లీకి వెళ్లానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని, కేసీఆర్ నాయకత్వం కిందనే పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీకి అండగా నిలవాలి

- ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

కవాడిగూడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో పది పార్లమెంటు స్థానాలను బీజేపీ కైవసం చేసుకొంటుందని ఆయన ధీమా వ్యక్తం చే శారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని బీమా మైదాన్, అరవింద్‌నగర్ కాలనీ తదితర బస్తీలలో కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి ఇళ్ల వద్దకు డాక్టర్ కె.లక్ష్మణ్, స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీలు వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. లబ్ధిదారుల ఇంటికి మోదీ స్టిక్కర్ అంటించి వారి కుటుంబసభ్యులతో సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎంసి మహేందర్ బాబు. ప్రభాకర్ గంగపుత్ర, నాయకులు నాగరాజు, చంద్రశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ జి. రచనశ్రీ తదితరులు

మోర్చా నాయకులు రాహుల్‌చంద్ర. క్రాంతి కిరణ్, అంబేడ్కర్, ధన్‌రాజ్, అనిల్‌కుమార్, గణేష్, సందీప్‌సాయి, సుమంత్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలి




సమావేశంలోమాట్లాడుతున్న ఎడెల్లి అజయ్‌కుమార్

బర్కత్‌పుర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి , ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎడెలి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో శనివారం శివాజీ నగర్‌లో దళిత ఓటర్ల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దళితులు బీజేపీకి అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్సీ

బీజేపీని విమర్శించే నైతిక హక్కు మంత్రి పొన్నంకు లేదు

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్



బర్కత్‌పుర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్న బీజేపీని విమర్శించే నైతిక హక్కు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేదని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ స్పష్టం చేశారు. బీసీలకు బీజేపీ ఏమీ చేయలేదని మంత్రి పొన్నం చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. శనివారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఏం చేసిందో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. 27మంది కేంద్రమంత్రులు బీసీలు అని ఇది మంత్రి పొన్నంకు తెలియదా అని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం కేంద్ర ప్రభుత్వం గురించి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన హితవు పలికారు.



శనివారం పదోతరగతి పరీక్షలు ముగిశాయి. ఈనెల 18న ప్రారంభమైన ఎస్సెస్సీ పరీక్షల్లో శనివారం చివరి పరీక్ష సాంఘికశాస్త్రం రాసిన విద్యార్థులు హాలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆనందంతో కేరింతలు కొట్టారు. పరీక్షలు ముగిశాన్న ఆనందం ఒక వైపు.. ఇన్నాళ్లు కలిసి ఉండి ఇక విడిపోతున్నామన్న బాధతో ఒకరి నొకరు విద్యార్థులు వీడ్కోలు పలికారు.

- (బర్కత్‌పుర, ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)

సబ్సిడీ ద్వారా కారు ఇప్పిస్తానని మోసం

- వ్యక్తికి జైలు, జరిమానా విధింపు



హరిహరరావు

చిక్కడపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సీఎం క్యాంప్ ఆఫీస్‌లో పరిచయాలు ఉన్నాయని, సబ్సిడీ ద్వారా ఎర్టిగా కారు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తికి శనివారం నాంపల్లి 9వ ఎంఎం కోర్టు జడ్జి జైలు శిక్ష, జరిమానా విధించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం 2019లో మెట్టుగూడకు చెందిన కె.హరిహర రావు సబ్సిడీ ద్వారా కారు ఇప్పిస్తానని చిక్కడపల్లికి చెందిన కె.కుమార్ నుంచి రూ.8.50లక్షలు తీసుకున్నాడు. కారు ఇప్పించకుండా తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండడంతో మోసం చేశాడని గ్రహించిన బాధితుడు చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు నేరం చేసినట్లు రుజువుకావడంతో ఆయనకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానాను విధిస్తూ శనివారం నాంపల్లి 9వ ఎంఎం కోర్టు జడ్జి ఉదయభాస్కర్ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ సీతయ్య వివరించారు.

5 లక్షల నగదు పట్టివేత

కవాడిగూడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు, రసీదులు లేకుండా బైక్‌పై తరలిస్తున్న రూ.5లక్షలను దోమలగూడ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్‌లో భాగంగా గాంధీనగర్ ఏసీపీ మొగిలయ్య, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధర్యంలో శనివారం రాత్రి వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో విజయ్‌భాస్కర్ రూ. 5లక్షలు బైక్‌పై తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. డబ్బులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

కమీషన్ విషయంలో వివాదం

- రాంనగర్‌లో వీధి పోరాటం..
- 15 మంది అరెస్ట్

రాంనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార లావాదేవీలకు సంబంధించిన కమీషన్ పంపకాల విషయంలో తలెత్తిన వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. రెండు గ్రూప్‌లకు చెందిన యువకులు శుక్రవారం రాత్రి రాంనగర్‌లో ఘర్షణ పడి వీధి పోరాటానికి దిగారు. రాంనగర్ మేడిబావిబస్తీ, హోటల్ ఫోర్‌చిల్లీ చౌరస్తాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇరు గ్రూప్‌లకు చెందిన దాదాపు 15 మందిపై ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్‌లోని మేడిబావిబస్తీలోని ఫాతిమా మసీదు ప్రాంతానికి చెందిన అక్బర్, అక్తర్ వాహనాల కొనుగోలు వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల టాటా ఏస్ వాహనం చెల్లింపు విషయంలో వచ్చిన కమీషన్ రూ.31 వేలు పంపకంలో విభేదాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య మాటామాట పెరిగి మేడిబావిబస్తీలో ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు అక్కడికి చేరడంతో సుమారు 50 మంది ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఈ కొట్లాట మేడిబావి బస్తీనుంచి మొదలుకుని సమీపంలోని హోటల్ ఫోర్‌చిల్లీ చౌరస్తాకు సాగింది. ఈ ఘటనలో ఇద్దరికి బలమైన గాయాలు తగిలాయి. విషయం తెలుసుకున్న ముషీరాబాద్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఘర్షణ పడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకుని రెండు గ్రూప్‌లపై కేసు నమోదు చేశారు. ఈ వీధికొట్లాట సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాంనగర్‌లో దాడికి పాల్పడుతున్న యువకులు

ఇద్దరి మృతికి కారణమైన ఫిట్‌నెస్ లేని లారీ.. లైసెన్స్‌లేని డ్రైవర్

- రోడ్డు ప్రమాదం కేసులో ముగ్గురి అరెస్టు
- పరారీలో డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ ఎండీ

బోయినపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని లారీతో లైసెన్స్ లేని డ్రైవర్ చేసిన ప్రమాదం వల్ల రెండు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి లారీ యజమాని మరో నేరం చేశాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ స్థానంలో నకిలీ డ్రైవర్‌ను చూపించి పోలీసులను తప్పుదోవ పట్టించాడు. దర్యాప్తు చేసిన పోలీసులు లారీ యజమానితో పాటు.. ప్రమాదానికి కారణమైన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో లారీ డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ఎండీ పరారీలో ఉన్నారు. శనివారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ శాంతిభద్రతల విభాగం డీసీపీ రోహిణి ప్రియదర్శిని, ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జాతీయ రహదారిలోని మిలటరీ డెయిరీ ఫాం సమీపంలో లక్ష్మీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. అక్కడ ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మార్చి 24 అర్ధరాత్రి 44వ పిల్లర్ వద్ద భారత్ ఫైబర్ కేబుల్‌కు సంబంధించిన వైర్లు కిందపడ్డాయి. అవి తగిలి ఓ వాహనదారుడు కిందపడ్డాడు. వైర్లను తొలగించే క్రమంలో వాహనాలు ఆగాయి. అదే సమయంలో సుచిత్ర నుంచి వేగంగా వస్తున్న లారీ ముందున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో ఓ బైక్‌పై ఉన్న ఆకాశరాజ్, నందిని అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు.

- **డ్రైవర్‌ను మార్చేసి, పోలీసులను ఏ మార్చి..**

ప్రమాదానికి కారణమైన లారీకి ఫిట్‌నెస్ లేదని, డ్రైవర్‌కు లైసెన్స్ లేదని తెలిసిన లారీ యజమాని ఎలాగైనా కేసు నుంచి బయటపడాలని ప్లాన్ వేశాడు. పారిపోయిన డ్రైవర్ స్థానంలో లైసెన్స్ ఉన్న నకిలీ డ్రైవర్‌ను పెట్టి పోలీసులకు అప్పగించాడు. ఈ కేసులో భద్రతా చర్యలు తీసుకోని ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ప్రాజెక్టు మేనేజరైన విజయవాడకు చెందిన కె.రాఘవేంద్ర, ఖైరతాబాద్‌కు చెందిన భారత్ ఫైబర్‌నెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం పూర్ణచందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరుపుతున్న క్రమంలో లారీ నడిపిన డ్రైవర్ లొంగిపోయిన వ్యక్తి కాదని, వేరే వ్యక్తి అయి ఉంటాదని పోలీసులకు అనుమానం వచ్చింది. లొంగిపోయిన డ్రైవర్‌ను తమదైన శైలిలో విచారించగా యజమాని సూచనతోనే లొంగిపోయానని అతడు వెల్లడించాడు. అతడిచ్చిన సమాచారంతో మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన లారీ యజమాని అర్జున్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిర్మాణ సంస్థ లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ వేములపల్లి కిరణ్‌కుమార్, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఉర్సి షేక్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుపునకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

- పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్



ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో దానం నాగేందర్

రాంనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం పార్టీశ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ పిలుపునిచ్చారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దానం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జె.ఎన్.కేశవ్, నాయకులు శ్రీరాములు యాదగిరి, ప్రొఫెసర్.కృష్ణారావు, కొండూరి ప్రసాద్‌రావు, ప్రసాద్‌యాదవ్, రాజుగౌడ్, జీ.ఎన్.నాగేంద్రప్రసాద్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌పై ఉపాధ్యాయులకు స్పష్టత ఇవ్వాలి

కవాడిగూడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న టెట్‌పరీక్షపై నెలకొన్న గందరగోళంపై స్పష్టత ఇవ్వాలని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల సందేహాలపై వీలైనంత త్వరగా ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. శనివారం విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యకు వినతి పత్రం సమర్పించినట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు కె.జంగయ్య, చావరవి, పి. నాగిరెడ్డి, టి.లింగారెడ్డి, జి.సదానందంగౌడ్, ఇష్తెకార్ అహ్మద్, కె. కమలాకర్‌రావు, జి.జగదీష్, లింగం, అజ్మతుల్లా తదితరులు తెలిపారు. ప్రభుత్వం డీఎస్సీకి ముందు టెట్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించిందని, దీనిలో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయని వాటిని పూర్తిగా వివరాలించాల్సిన బాధ్యతపై ఉందని అన్నారు.

ఆకట్టుకున్న పేరెంట్స్ గానవిభావరి

చిక్కడపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నవహృదయరాగం సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన గానవిభావరి ఆకట్టుకుంది. లిటిల్ మ్యూజీషియన్స్(ఎల్ఎంఏ) సౌజన్యంతో త్యాగరాయగానసభలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పలులలిత గీతాలు, సినీగీతాలు మధురంగా ఆలపించారు. ఈసందర్భంగా ప్రముఖగాయకులు, సంగీతదర్శకులు రామాచారిని గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సీఎండి సయ్యద్‌ఇమామ్, డైరెక్టర్ నరసయ్యలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని, సింగింగ్ స్టార్ విజయలక్ష్మి, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, శ్రీరామ సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు గొర్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భోలక్‌పూర్‌లోని బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి. రాకేష్ అన్నారు. శనివారం సిద్దిక్‌నగర్‌లో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) రెయిన్‌బో హోం, ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో హోం సీనియర్ మేనేజర్ శ్రీలత, కో-ఆర్డినేటర్ క్రాంతి కిరణ్, ఎస్ఆర్‌డి సంస్థ ప్రతినిధులు కిషోర్ ఇందిరాభారతి, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పండ్లు, అల్పాహారం పంపిణీ



కందూరి ఫౌండేషన్, సేథ్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలో పేదలకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కందూరి కృష్ణ, ప్రమోద్ అగర్వాల్, కె.కౌశిక్, వరాలిణ్మీ పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

తల్లిదండ్రులకు ముగ్గురు మైనర్ల అప్పగింత

బర్కత్‌పుర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి తల్లిదండ్రులకు చెప్పకుండా నగరానికి వచ్చిన ఒక బాలుడు, ఇద్దరు బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. తల్లిదండ్రులతో పాటు ఛత్తీస్‌గఢ్ పోలీసులు కూడా వారి వెంటవచ్చారు. బిహార్ రాష్ట్రానికి చెందిన శివం మిశ్రా (17)కు ఇన్‌స్టాగ్రామ్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు బాలికలు కిరణ్‌సింగా(16), పుష్పపటేల్ (15) పరిచయమయ్యారు. చార్మినార్ చూసేందుకు వారిని తీసుకొని నగరానికి అతను వచ్చిన విషయం విదితమే. ఈ ముగ్గురుని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని చైల్డ్‌వెల్ఫేర్‌కు అప్పగించారు. శనివారం ఇద్దరు బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించగా.. బాలుడు శివం మిశ్రాపై పటేవా పీఎస్‌లో కేసు నమోదు కావడంతో అక్కడి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారని సీఐ ఎల్లప్ప తెలిపారు.